


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

## కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో
## అలనాటి అందమైన నవల పునర్ముద్రణ

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**ఆమె అందకపోయాక** విలువ మరీ ఎక్కువై అతన్ని అనుక్షణం వేధించసాగింది.

లైటు వెలిగించాడు. తోటలోకి వచ్చాడు. సన్నజాజులు గుబాళిస్తున్నాయి. అతని హృదయ క్షేత్రంలో ఓ మెరుపు మెరిసింది.

"ప్రపంచమంటే మితిలేని అసహ్యం కలిగితే నాదగ్గరకు వచ్చేయండి."

పద్మజ పిలుస్తోంది, వెయ్యి గొంతుకలతో ఎలుగెత్తి రమ్మని.

29

మధుబాబు హైదరాబాద్ చేరుకుని, ఓ హోటల్లో దిగాడు. ఎంతోకాలంగా ఎదురు చూస్తోన్న కలయిక యిది. అతనికి చాలా భయంగా ఉంది. చివరకు పద్మజను కలుసుకోబోతున్నాడు. ఎన్నోసార్లు తననిక్కడకు రమ్మన్న పద్మజను, తన జీవితంతో పెనవేసుకుపోయిన పద్మజను. వచ్చే ముందు ఉత్తరం రాశాడు "పద్మా, నే వచ్చేస్తున్నాను చివరకు. నేను నీకు నచ్చినా, నచ్చకపోయినా నువ్వు నన్ను భరించాలి. నీ యిష్టం వచ్చినన్ని రోజులు అక్కడ నేను ఉంటాను. ఏం చేస్తావో, ఎక్కడకు తీసుకెడతావో అంతా నీకే వదిలిపెడ్తున్నాను."

టెలిఫోన్ డైరక్టరీ తీసి ఆమెకి రాసే అడ్రస్‌లో కేరాఫ్ అని ఉండే పేరు వెదికాడు. ఆ పేరు ఎవరిదో అతనికి తెలియదు. అతని అదృష్టవశాత్తు వాళ్ళ యింట్లో ఫోను ఉంది. ఆ నంబర్‌కి ఫోన్ చేశాడు.

అతని గుండె గబగబా కొట్టుకుంటోంది.

ఎవరో అవతలి వైపు రిసీవర్ అందుకున్నారు. "హలో" అంది ఎవరో చిన్నపిల్లవాడి కంఠం.

"పద్మ.. పద్మజగారున్నారా?" అన్నాడు వణికే కంఠంతో.

"మా అత్తయ్యాండీ?"

మధుబాబుకు నవ్వు వచ్చింది – "అవును మీ అత్తయ్యే" అని అన్నాడు.

"ఉండండి పిలుస్తాను లైనుమీద ఉండండి."

అతను శ్రద్ధగా ఆలకిస్తున్నాడు.

ఒకటి...రెండు.. మూడు క్షణాలు.

"హలో!"

అతను ఉలికిపడ్డాడు ఎంత సన్నగా వుంది ఆ కంఠం. ఏదో లోకాతీతమైన బాధలుపడుతూ, బయటికి సామాన్యంగా కనిపించే వ్యక్తి మాట్లాడినట్లుగా వుంది.

"మాట్లాడేది మీరేనా?" అంటున్నాడు మధుబాబు.

"మీరెవరండీ?"

ఒక క్షణం నిశ్శబ్ధం, "మైగాడ్" అంది అవతలి కంఠం.

"నేను వచ్చేశాను పద్మా!"

"ఎందుకు వచ్చావు మధూ! ఇప్పుడెందుకు వచ్చావు?" అనుకుంటోంది దిగులుగా పద్మజ అక్కడ.

"పద్మా! పద్మా!"

"వింటున్నాను."

"నన్నేంచెయ్యమంటారో చెప్పండి ఇప్పుడు."

"మీరే చెప్పండి."

"నేను హోటల్‌లో దిగాను. ఎడ్రెస్ యిస్తాను. ఇక్కడికి..."

"రేపు సాయంత్రం మా ఇంటికి రండి."

"పద్మా!"

"అవును. ఇక్కడికే వచ్చేయండి. తప్పకుండా రండి. ఎదురు చూస్తూ వుంటాను. సెలవా మరి?"

ఆమె ఫోన్ క్రింద పెట్టేసింది. అతను హతాశుడైనాడు.

తాను రావటం ఇష్టంలేదా ఆమెకు? ఆ విషయం స్పష్టంగా చెప్పచ్చుగా. "వచ్చెయ్యి.. వచ్చెయ్యి" ఇలా రాసిన పద్మజ మాటలేనా అవి. ఉత్తరాల్లో జీవించి, వాస్తవంలో మరణించే మైనపు బొమ్మా పద్మజ. అసలు యీ ఆడవాళ్ళంతా అంతేనేమో? అతనికి కోపం వచ్చింది. ఆమెని కలుసుకోకుండా వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనుకున్నాడు. కాని ఎలా? ఆ అసంతృప్తి మరీ భరించలేనిదిగా ఉంటుంది. తను ఎందుకూ పనికిరాని అసమర్థుడుగా తయారవుతాడు కాని ఆమె ఇంటికి వెళ్ళటం ఎలా? అక్కడ ఎవరెవరుంటారో ఏం పాడో? ఏం మాట్లాడతాడూ అంతమందిలో? అసలంత బుద్ధిలేకుండా అక్కడికెలా రమ్మంది. నిజంగా ఒట్టి మొద్దే, పైగా తనని అడవి మనిషంటుంది, ఆమే అన్నీ. పైగా రేపటి దాకా ఇక్కడ ఒక్కడే ఎలా వుంటాడనుకుంది?

ఆ సాయంత్రం సినిమాకు వెళ్ళాడు. చూడబుద్ధి కావటంలేదు. ఎలాగో ఆ రెండున్నర గంటలు గడిపి, బయటకు వచ్చేశాడు. రూముకి వచ్చి అన్నం తినకుండా పడుకున్నాడు.

నిద్ర రావట్లేదు. బయట బాగా చలిగా వుంది. తలుపులన్నీ ముసుకుని, రగ్గు కప్పుకుని ఆలోచిస్తున్నాడు. ఈ పాటికి ఏం చేస్తూ వుంటుంది పద్మజ.

సరిగ్గా అప్పుడు పద్మజ తన డైరీలో ఇలా రాసుకుంటోంది – "ఊహలోని మధుబాలు చెరిగిపోతున్నాడు."

ముఖాన స్వేదబిందువులు అలుముకున్నాయి. అలిసిపోయిన మనసుతో ముందున్న బల్లమీదకువాలి కళ్ళుమూసుకుంది.

"పద్మజగారున్నారా?" అనడిగాడు మధుబాబు అక్కడున్న అబ్బాయిని.

"మా అత్తయ్యండీ"

"అవును, మీ అత్తయ్య"

"ఉంది కూర్చోండి, చెప్పివస్తాను" అంటూ లోపలకు పరుగెత్తాడు.

అతనక్కడ కుర్చీలో కూర్చుని నలువైపులా చూడసాగాడు. గుండె గబగబా కొట్టుకుంటోంది. ఇంత పిరికివాడాతను? ఎలాంటి శిక్ష విధిస్తోంది ఆమె తనకు?

ఓ పదహారు, పదిహేడు ఏళ్ళ వయస్సులో ఉన్న అమ్మాయి తెర తొలగించుకుని ఇవతలకు వచ్చింది. నల్లగా పొట్టిగా, కొంచెం లావుగా ఉంది. అపరిచితుడ్ని చూసి ప్రశ్నార్ధకంగా ముఖం పెట్టి "ఎవరుకావాలండీ?" అనడిగింది.

"పద్మజగారు" అన్నాడతను బిక్క మొహంతో.

"పిల్చుకు వస్తానుండండి" అంటూ ఆమె మళ్ళీ లోపలకు వెళ్ళిపోయింది. 'హమ్మయ్య' అని కుదుటపడి, మళ్ళీ ఓసారి కలయజూచి "పెద్ద ఇల్లు చాలా" అనుకుంటున్నాడు.

అడుగులచప్పుడైంది. అతను తల ఎత్తి చూశాడు లోపల్నుంచి సన్నగా, పొడుగ్గా, ఎర్రగా, చాలా అందంగావున్న ఓ అమ్మాయి గదిలోకి వచ్చి మధుబాబుని చూసి, కొంచెం చకితురాలై "ఎవరి కోసమండీ?" అంది తియ్యని కంఠంతో.

అతనామె ముఖంలోకి పరీక్షగా చుస్తూ "పద్మజగారి కోసం...." అన్నాడు.

"ఓహో పిల్చుకు వస్తానుండండి" అంటూ ఆమె లోపలకు వెళ్ళిపోయింది తిరిగి హంస నడకతో.

మధుబాబు నిట్టూర్పు విడిచాడు.

ఓ నిముషం గడిచాక మొదట లోపలకు వెళ్ళిన అబ్బాయి ఇవతలకు వచ్చి "గదిలోకి రమ్మంటుందండీ అత్తయ్యా" అన్నాడు.

"ఎక్కడికి?"

"తనగదిలోకి, రండి తీసుకువెడతాను."

అతను లేచి నిల్చున్నాడు. కుర్రాడి వెనక నడవసాగాడు.

లోపలికి వెళ్ళాక ప్రక్కగా ఓ తెరకట్టివున్న గది చూపించి "ఇదే లోపలకు వెళ్ళండి" అన్నాడు.

అతని కాళ్ళు తడబడినాయి. ఒక్క క్షణం కదలకుండా నిలబడిపోయాడు. ఆ క్షణంలో అతననుభవించిన యమయాతన రాయటానికి  నా కలం జంకుతోంది. అర్థం చేసుకునే సానుభూతి పరులెవరైనా వుంటే ఓ నిట్టూర్పు విడవవచ్చు.

తెగించి లోపలకు అడుగుపెట్టాడు.

"రండి" అంది పద్మజ.

అతడామెని చూశాడు. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి అనుకోకుండా. ఆమె అతన్ని నఖశిఖ పర్యంతం చూస్తోంది. "కథ ముగింపుకు వచ్చింది" అనుకోసాగాడు మధుబాబు.

"కూర్చోండి" అంది తియ్యటి కంఠంతో.

అతనామెకెదురుగా ఓ సోఫాలో కూర్చున్నాడు. ఇద్దరూ మౌనంగా, ఏమీ మాట్లాడలేని స్థితిలో ఒకరివంక ఒకరు నిమిషాల తరబడి అవలోకించుకుంటున్నారు.

"యూ ఆర్ గ్రేట్" అనుకున్నాడు మధుబాబు. అది ఆమెని చూశాక అతనికి కలిగిన మొట్టమొదటి తలపు. మాములు అంతస్థుకి అందని అపూర్వ వ్యక్తిలా, యీలోకానికి సంబంధించని మనిషిగా, అతీతంగా చిత్రంగా, అందని తియ్యని ఆశలా, బాధల్ని అణిచిపెట్టుకుంటూ బలవంతంగా జీవించే ప్రాణిలా, వరమివ్వని దేవతలా, తెల్లగా జపాన్ బొమ్మలా సంతోషంతో అందంగా, సన్నజాజి గుచ్ఛంలా, అతి సుకుమారంగా, చురుగ్గా, తెలివిగా, అద్భుతంగా వుంది పద్మజ. ఇరవయి, ఇరవయి ఒకటి యేళ్ళకన్నా ఎక్కూ వుండవు. కొంచెం పొడవుగా, పొడిక్కి కొంచెము తగిన లావుగా

వుంది .ముఖ్యంగా ఆ కళ్ళు... అబ్బ..."ఒక కోటిలోనేగాదు, నీలాంటి స్త్రీ ఈ భూమ్మీద లేదు" అనుకున్నాడు మధుబాబు ఆశ్చర్యంగా.

నిజంగా పద్మజ అలా ఉందో లేదో నేను స్పష్టంగా చెప్పలేనుకాని మధుబాబు కళ్ళకు అలా కనిపించిందనటంలోనూ, అతని హృదయపులోతుల్నుంచీ ఈ ఊహలన్నీ పొంగినాయనటంలోనూ రవంతకూడా అతిశయోక్తి లేదు.

"ఏం మాట్లాడేది?" అన్నాడు మధుబాబు అసహజ కంఠంతో, జాలిగా. అది సంభాషణకు నాంది ప్రస్తావన. చాలా నీరసంగా వుంది అతనికి.

"ఎందుకు వచ్చేశారు?" అనడిగింది పద్మజ నిట్టూర్చి.

"రాకుండా ఉండలేకపోయాను." అన్నాడు, గొణుగుకున్నట్లు మధుబాబు.

పద్మజ తన రెండు చేతులతో ముఖాన్ని దాచుకుంది.

"అంతాపాడు చేసేశారు, అంతా పాడుచేసేశారు" అంది వ్యతీతంగా.

అతను మాట్లాడకుండా చూస్తున్నాడు.

ఆమె ముఖాన చేతులు తొలగించి "యెందుకు వచ్చేశారు ఇంత హఠాత్తుగా? నన్ను ఓసారి చూసి చేతులు దులిపేసుకుని పోదామనా?"

"నేను రావటం మీకు ఇష్టంలేదా?"

"ఇష్టం....ఇష్టం...అబ్బ నా భావాలు.. ఆ ఊహలు యెలా అర్థమవుతాయి మీకు? ఏం చెప్పేది మీకు?"

"పద్మా!" అన్నాడు మధుబాబు గాద్గదికంగా.

“ప్రపంచమంటే అసహ్యం కలిగితే ఇక్కడకి వచ్చెయ్యమని ఒకసారి మీరు వరం ఇచ్చారు. రావటానికి నేనూ భయపడ్డాను. మీ ఊహా స్వప్నం నాకు తెలుసు. నేను మీకు సమవుజ్జీని కాననీ తెలుసు. ఎక్కడకూ పోలేక ఏమీ చెయ్యలేక, చితికి ఛిద్రమైన హృదయంతో. అంతిమ ఆశతో, మీ దగ్గరకొచ్చాను. నేను మీముందు చాలా అల్పుడినని నా అంతరాత్మ ఘోషిస్తోంది. మీరు చాలా గ్రేట్. కాని అనవసరంగా నన్ను మీరు ఇమాజిన్ చేసుకున్నారు. మీరు అనుకున్నట్లు వుండటం నాకెలా సాధ్యం? దానికి నేనేం చెయ్యగలను? నన్నెవరయినా ప్రేమిస్తే, అభిమానిస్తే నన్ను నన్నుగానే చూసి, నా సర్వస్వం

లోపాలూ, గుణాలూ అన్నీ తెలుసుకుని అభిమానించాలి. నన్ను ఎవరిగానో, యెలాగో చిత్రించుకుని ఆరాధించటం నాకిష్టంలేదు. అది నేను భరించలేను. ఆ ఆరాధన నాకొద్దు. నాకెంత చిత్రహింసో మీకు తెలియదు. మనఃస్థితి ఇంతవరకూ వచ్చాక మిమ్మల్ని మరిచిపోవటం దుస్సాధ్యం కావచ్చు. కాని ఈ దాగుడు మూతలకు స్వస్తి చెబుదామనీ, యీ సంఘర్షణని బ్రేక్ చేసేద్దామనీ ఇక్కడకు వచ్చేశాను పద్మా! నీ ఊహాస్వప్నం చెదిరిపోతే క్షమించు. చాలాసార్లు చెప్పాను. అలా చెయ్యద్దని, కాని ఫలితమిద్దరం అనుభవిద్దాం. వస్తా పద్మా"

అతను లేచి నిలబడినాడు. ముఖం ఎరుపెక్కింది. పెదవులు వణుకుతున్నాయి. చూపులు చలిస్తున్నాయి. విషణ్ణంగా, విషాదంగా.

"వెళ్ళొద్దు" అంది పద్మజ ఆదుర్దాగా, తొట్రుపాటుతో.

అతను ఆశ్చర్యంగా చూశాడు.

"అవును మీరు వెళ్ళొద్దు నన్ను నమ్మండి. మీరు నన్ను డిసప్పాయింట్ చెయ్యలేదు. నిజం మధూ! ప్లీజ్ రండి"

"నన్ను మీరు అసహ్యించుకోవడంలేదా?"

"ఉహూఁ"

"నన్ను చూసి ఏమీ ఆశాభంగం పొందలేదా?"

"ఉహూఁ"

"నన్ను..నేనంటే అయిష్టమేమీ ఏర్పడలేదా?"

ఆమె తల ఊపింది, సిగ్గుపడుతూ.

అతనికి పెద్ద బరువు తొలిగిపోయింది. ఎంత తేలిగ్గా, హాయిగా వుందిప్పుడు? తిరిగి వచ్చి కూర్చున్నాను.

"మిమ్మల్ని చూస్తోంటే నాకంటే ఎంతో చిన్నవారనిపిస్తోంది యిప్పుడు. ఎంత పసిగా వున్నారు. అదేమిటి సరిగ్గా కూర్చోండి."

మధుబాబు సోఫా మీదనుంచి పాదాలు క్రిందపెట్టేసి "సారీ. అట్లా కాళ్ళు మీద పెట్టుకుని కూర్చోవటం అలవాటు" అన్నాడు సిగ్గుపడుతూ.

పద్మజ కొంచెం నవ్వి "అట్లా బ్లంట్‌గా చెప్పేసినందుకు సారీ. ఎవరన్నా చూస్తే ఏమనుకుంటారు..." అంది

"హోటల్లో ఎందుకు దిగారు. ఈ వూళ్ళో మీకెవరూ లేరా?" అనడిగింది ఆమె మళ్ళీ.

"ఎందుకు లేరు. ఉన్నారు."

"ఎవరూ?"

ఆమె తలవంచుకు కూర్చుంది. ఓ క్షణం గడిచాక ముఖం ఎత్తి "ఎంత వేదనగా వున్నదో తెలుసా నాకు?"

"ఏమలా?"

"అర్ధంకాలేదా? మీరక్కడ.. నేనిక్కడ. యీ నాలుగు గోడల మధ్య మీకు నేనేమీ చేయలేను. నా ప్రవర్తన చూసి మీరెంతో నిరాశ పొందుతారు. నావల్ల మీకేమీ శాంతి లభించదు" ఆమె దీనంగా అంది.

"ఎందుకని పద్మా? ఎట్లా రాశావు ఉత్తరాల్లో, వచ్చెయ్యి వచ్చెయ్యి  అని ఎట్లా పిలిచావు?"

"అదంతా అబ్బ ఎంతో ఆవేశం మధూ! అప్పుడు నువ్వు వస్తే అట్లాగే చేసేదాన్నేమో. ఎన్ని కలలుగన్నాను. అబ్బ ఎన్ని ఊహలు, నువ్వు వచ్చావని తెలియగానే నీ దగ్గరకు పరిగెత్తుకుని వచ్చేద్దామనుకున్నాను. మనమిద్దరం ఒక్క యింట్లో వున్నట్టూ – నిన్ను నిద్రలేపి కాఫీ అందివ్వటం, ఎక్కడో వంటరిగా అబ్బ! ఎంత యిన్సిపిరేషన్. అందుకే అంతా పాడుచేశావని కోపంగా వుంది. ఎంత డల్‌గా వుంది యిట్లా కలుసుకోవటం? ఏమిటి మధూ, ఇట్లా చేసేశావు. నన్నింత చేతగాని దాన్నిగా చేసి, యీ స్థితిలో... ఎట్లా భరించేది మధూ! నేనెట్లా భరించేది అవస్థ" పద్మజ పిచ్చి దానిలా తాపత్రయ పడిపోతోంది.

మధుబాబు ఓ క్షణం నిదానించి "నేనిప్పుడు రావటం మంచిపని కానట్లయితే భవిష్యత్తులో అలాంటిరోజు ఒకటి వుండగలదా పద్మా, నీకు నమ్మకం వుందా?"

"నాకు నమ్మకం వుంది. తప్పకుండా వచ్చేది" అందామె ఎంతో విశ్వాసంగా.

"ఎలా? నీది వొట్టి కలలుగనే స్వభావం పద్మా. అట్లా ఊహలు నిర్మించుకుని, ఆ ఆశల్లో జీవిస్తూంటావు. ఇప్పుడు లేనిది, యీ జన్మలో, ఒకరి భార్యగా వుండి యెట్లా సాధ్యం? నీకెంతో స్వాతంత్ర్యం వుందనుకున్నాను. ఎన్నో కలలతో, ఏదో జీవిద్దామన్న ఆశతో నిన్ను వెదుక్కుంటూ వచ్చాను. మొదట నిన్ను చూసిన క్షణంలో నాకంటే ఎన్నోరెట్లు యెక్కువేగా, తలయెత్తి చూడటానికి అందని అంతస్థులో వున్నావనిపించింది. అంత చనువుగా యీ దేవతకెట్లా రాశాను అనిపించింది. నీక్కూడా వున్నాయా పద్మా యీ బంధాలు, నిబంధనలు.  నాకోసం బయటికి రాలేవా?"

ఆమె ఖేదంగా, విచార వదనంతో "అయ్యో! నేనుకూడా యెంతో సామాన్యురాల్ని మధూ! మామూలు ఆడదాన్ని...మామూలు ఆడదాన్ని."

అతనేమీ మాట్లాడలేకపోయాడు. ఆమె కళ్ళలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

"కాఫీ తీసుకు వస్తాను" అంటూ లేచి వెళ్ళింది ఆమె.

ఓ అయిదు నిమిషాల్లో రెండు చేతుల్లోనూ, రెండు కప్పులతో తిరిగి వస్తూ "అదిగో మళ్ళీ సోఫా మీద కాళ్ళు.."

"సారీ" అంటూ తీసేశాడు.

"ఏం చెయ్యమంటావు చెప్పు పద్మా" అన్నాడతను కాఫీ త్రాగుతూ దిగులుగా.

"నన్నేం చేయమంటారు చెప్పండి."

అతను కొంచెంగా నవ్వడు.

"నాకు నవ్వు రావటంలేదు" అంది పద్మజ.

"నాకూనూ"

"కాని మీరు నవ్వారు"

"ఏడవలేక"

ఆమె కొంచెంగా వొణికి, మెల్లగా కాఫీ త్రాగసాగింది.

"నేనిట్లా యిక్కడకు రావటం, యిట్లా వుండటం నీకేమైనా యిబ్బంది..."

"ఇవాళ్టికి పెద్ద యిబ్బంది లేదు."

"మీ వారు..?"

"ఓ అరగంటలో వస్తారు"

అతని మనసంతా అదోలా అయిపోయింది. "నేనింక వెడతాను పద్మా" అన్నాడు అనుకోకుండా.

ఆమె భయంగా చూసింది.

"నేను వెళ్ళటం నీకు యిష్టంలేదా?"

"ఊహూం" అని తల అడ్డగా తిప్పింది.

"మరి అయితే వుండేదా?"

"వద్దు"

"ఆయన వస్తారనా?"

పద్మజ నవ్వింది.

"మనం మళ్ళీ ఎలా కలుసుకోవటం?"

"ఎలా? ఎలా కలుసుకుంటాం. పోనీ ఓ విషయం చెప్పేదా?"

అతను ప్రశ్నార్ధకంగా చూశాడు.

"నన్ను మరిచిపోండి."

"పద్మా"

"నిజం. ఇంతకంటే ఏం చేయలేం మనం. నేను వొట్టి అస్వతంత్రురాలిని మీరిక్కడికి వచ్చి అంత దూరంగా వుండటం భరించలేను. మీరు ఊరికి వెళ్ళిపోండి యివాళే"

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments